# బాంధవ్యాలు

"**శ్రీశీ**దేవి బజారుకెళ్తోంటే నేనూ వెళ్లాను. ఈ చీర కొన్నాను. బాగుందా?" నీలం రంగు సిల్కు చీరను చూపిస్తూ అడిగింది సుమిత్ర. అలాంటి చీరలు తను కట్టదని నాకు తెలుసు. అందుకే ఎవరికని అడిగాను. "చెప్పుకోండి చూద్దాం!" అని మళ్ళా ఆగలేనట్లుగా వెంటనే తనే చెప్పింది.

"ప్రసూన సింగపూర్ నుండి నాలుగురోజుల్లో వస్తుందని ఉదయం సుశీలమ్మగారు చెప్పారు. ఢిల్లీలోని వాళ్ళ ఆఫీసు బ్రాంచికి అరవింద్‌ని పని మీద పంపిస్తున్నారట. అందుకని ఇద్దరూ వస్తున్నారు. అతను ఢిల్లీలో వున్న ఆ వారం పదిరోజులూ ప్రసూన ఇక్కడుంటుందట. శ్రీశీదేవి ఇలాంటిరంగు చీరపైన చిన్న చిన్న తెల్లని పూసలను డిజైన్‌గా కుట్టింది. శ్రీశీదేవి కట్టుకున్నప్పుడు ఆ చీర చాలా బావుందని ప్రసూన నాలుగైదు సార్లు అంది. అందుకే ప్రసూనకీ అలాంటి చీరను ఇద్దామని బజారుకెళ్లా. అదేరంగు చీరను కొనాలని అనుకునే సరికి అయిదారు షాపులు తిరగాల్సి వచ్చింది. మొత్తానికి ఎలాగైతేనేం దొరికింది! పూసలవీ కూడా కొనుక్కొచ్చా. రేపటి నుండీ పనయిపోగానే శ్రీశీదేవి దగ్గరకెళ్ళి కూర్చున్నానంటే నాలుగైదు రోజుల్లో కుట్టెయ్యొచ్చు" అంది సుమిత్ర హుషారుగా.

"నీ ఆనందం చూస్తుంటే... కన్నకూతురే అత్తవారింటినుండి వస్తున్నట్లుగా వుందే!"

"నిజమే! నాకలాగే ఉంది మరి! ఎంతైనా రెండేళ్ళు మనతో కలిసిపోయి మనమ్మాయిలాగే మనింట్లో తిరిగిందిగా. అందరూ ప్రసూనని నా పెంపుడు కూతురని అనేవాళ్ళు కదా! మీకు కాఫీ తెస్తానుండండి" అంటూ వంట గదిలోకి వెళ్ళింది.

నేను కాలేజీ నుండి వచ్చాక కాఫీ ఇచ్చి, తనూ తీరుబడిగా కూర్చుని కాఫీ తాగుతూ ఆ రోజు కబుర్లన్నీ ఏకరువు పెట్టడం సుమిత్ర అలవాటు. ఈ రోజు మాత్రం ముందుగానే విశేషాలు చెప్పి

కాఫీ తేవటానికి వెళ్లింది! అంత హుషారుగా ఉంది మరి! లేకపోతే ఇప్పుడు కుట్టటం నేర్చుకుని మరీ ప్రసూన కోసం చీరపై ఎంబ్రాయిడరీ చేయాలనుకోవటం ఏమిటి?

ప్రసూన మా ప్రక్కింటి లక్ష్మీపతిగారి అమ్మాయి. మూడేళ్ళ క్రిందట వాళ్లు మా ప్రక్కింట్లోకి అద్దెకు వచ్చారు. పిల్లలకి స్కూలు దగ్గరని ఇక్కడికి మారారు. అప్పుడు ప్రసూన డిగ్రీ సెకండియర్‌కి వచ్చింది. అబ్బాయిలిద్దరూ హైస్కూలులో చదువుతున్నారు. కొత్తగా ఎవరు వచ్చినా పరిచయం చేసుకుని స్నేహం కలుపుకోవటం సుమిత్రకలవాటు. ఎందుకనో గానీ ప్రసూనా వాళ్లమ్మ గారితో స్నేహం పెరగలేదు కానీ ప్రసూన మాత్రం బాగా దగ్గరయింది. సుశీలమ్మగారితో పెరటిగోడ నుండి పలకరింపుల వరకే వాళ్ల పరిచయం పరిమితమైంది. ప్రసూనకి సుమిత్ర దగ్గిర బాగా చనువూ, అరమరికలు లేకుండా తన స్వంత విషయాలన్నీ చెప్పుకునేంత ఆత్మీయతా ఏర్పడ్డాయ్! సుమిత్ర మాటలనుబట్టి... వాళ్ళింట్లోని ఆ అమ్మాయి పరిస్థితి మాకు ఆశ్చర్యంగా అనిపించేది.

ఇంటరు పూర్తవగానే ప్రసూనకి, ఇంటరు తప్పి స్వంత ఊళ్లో వ్యవసాయం చేసుకుంటున్న సుశీలమ్మగారి తమ్ముడితో వివాహం జరిపించాలని అనుకుంటే, ప్రసూన ఒప్పుకోలేదు. తల్లిదండ్రులకు ఎదురు తిరిగింది. అప్పుడే పెళ్ళిచేసుకోకుండా వాళ్ళ యిష్టానికి వ్యతిరేకంగా చదువుకుంటున్నందుకో, లేక ఆడపిల్లల చదువుపట్ల ఆసక్తిలేకనో, ఎందువల్లనో గానీ తల్లిదండ్రులిద్దరూ ప్రసూన చదువుపట్ల శ్రద్ధ చూపించకపోగా, అడుగడుగునా నిరుత్సాహపరుస్తుంటారు.

వాళ్లయింటికి బంధువుల తాకిడి కొంచెం ఎక్కువే. అబ్బాయిలిద్దరూ ట్యూషన్ మాష్టారింట్లోనే చదువుకుని వస్తుంటారు. వచ్చిన చుట్టాలంతా ప్రసూన చదువుకునే గదిలోనే కూర్చుని కబుర్లకి దిగుతారు. ఎగ్జామ్స్ ఉండి సీరియస్‌గా చదువుకుంటున్నా సుశీలమ్మగారు ఏదో పని పురమాయిస్తూనే ఉంటారు. చదువుకోవాలని చెబితే... "చదివి ఎవర్ని ఉద్ధరించాలీ, ఏదో కాలక్షేపానికి చదివే చదువేగా" అని తేలికగా మాట్లాడతారట.

ఈ రోజుల్లో అందరూ అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చదివిస్తున్నారు. ఇంకా కొందరు ఇలా ఆడపిల్లల చదువు పట్ల వివక్ష చూపించే వాళ్లున్నారా అని మాకు ఆశ్చర్యంగా ఉండేది!

ఈ విషయాలన్నీ ప్రసూన అప్పుడప్పుడు సుమిత్ర దగ్గిర బాధపడుతూ చెబుతుండేది.

"తమ్ముళ్ళిద్దరూ ఏం కావాలని అడిగినా నిముషాల మీద అమరుస్తారు. అదే నేనడిగితే దండగ ఖర్చులా అనిపిస్తుంది. వాళ్ళు అడగకపోయినా ట్యూషన్ పెట్టించారు. నేను మాథ్స్ ట్యూషన్‌కి వెళ్తానంటే మాత్రం క్లాసులో చెప్పేటప్పుడు శ్రద్ధగా వింటే ట్యూషనక్కర్లేదు అని చెప్పేశారు! ఒక్కోసారి వీళ్ల స్వంత కూతుర్ని కాదేమో అనే అనుమానం కూడా వస్తుంటుంది ఆంటీ! చదువు విషయంలోనే కాదు అన్ని విషయాలలోనూ తక్కువగానే చూస్తారు. అప్పుడప్పుడూ ఇలా ఒంటరి పోరాటం చేసి చదవకపోతేనేం, మానేద్దామా అని కూడా విరక్తి కలుగుతుంటుంది!" అంటూ ప్రసూన బాధపడినప్పుడు సుమిత్ర నచ్చ చెబుతుండేది.

"వాళ్ల అభిప్రాయాల్లో, ఆలోచనల్లో పొరపాటు వల్ల అలా ప్రవర్తిస్తూండి ఉంటారేమోకానీ ప్రేమలేక కాదు. తల్లిదండ్రులకి పిల్లలందరూ సమానమే. చదువు మానేయ్యాలనే ఆలోచన మాత్రం మనసులోకి రానీయకు" అంటూ ప్రసూనకు తల్లిదండ్రుల పట్ల వ్యతిరేకత పెరగకుండా వీలయినంతవరకూ సర్ది చెబుతుండేది.

ఆ సంవత్సరం మా దగ్గరి బంధువొకాయన విజయవాడలో పెట్టిన రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్‌కు వచ్చిన మా అబ్బాయిలిద్దర్నీ చేర్పించాము. అందుకని వాళ్ళ బెడ్‌రూమ్ ఖాళీగానే ఉండేది.

ఆ గదికి వరండాలోకి ఒక ద్వారం కూడా ఉన్నందువలన ప్రత్యేకంగా ఉండేది. ప్రసూన వాళ్లింటికి బంధువులు వచ్చినప్పుడల్లా ఆ గదిలో కూర్చుని చదువుకోమని సుమిత్ర ప్రసూనకి సలహా ఇచ్చింది. "ఏమైనా డౌట్సు వస్తే అంకుల్‌ని అడుగుతుండవచ్చు కాబట్టి ఇక్కడ చదువుకుంటానని అమ్మకి సాకు చెప్పి అలాగే చేస్తానని" ప్రసూన ఆనందంగా అంగీకరించింది.

మొదట్లో చదువుకుని వెళ్లిపోతుండేది. ఎక్కువ సేపు చదువుకోవాల్సినపుడు ఇక ఆ గదిలోనే పడుకునేది... అలా రాను రాను తన పుస్తకాలు, బట్టలతో తన మకాం మూడొంతులు మా ఇంట్లోకి చేరింది. తన చదువు ప్రశాంతంగా సాగుతోందంటూ సంతోషపడింది. ఇంట్లో వాళ్లకి ఇష్టం లేకపోయినా పట్టుదలగా, శ్రద్ధగా చదువుకుంటున్నందుకు మాకు ముచ్చటగా అనిపించేది. ప్రసూనకి ఇష్టమైన కూరలు చేసిన రోజున సుమిత్ర ప్రసూనని భోజనానికి వాళ్లింటికి వెళ్ళనిచ్చేది కాదు. మాతోపాటే చేసేది.

మాథమేటిక్స్ లెక్చరర్ శర్మ దగ్గిర ప్రసూనకి ట్యూషన్ కూడా ఏర్పాటు చేశాను. వాళ్ల పిల్లలు అప్పుడప్పుడు నా దగ్గరకు కెమిస్ట్రీ చెప్పించుకోవటానికి వస్తుండేవాళ్లు. ఆపైన నాతో వున్న స్నేహం కొద్దీ కూడా అతను ఫీజు తీసుకోడని తెలుసు. ఉదయం ఆరుగంటలకే ట్యూషన్‌కి వెళ్లాలి. తెల్లవారుఝామునే లేవటం ప్రసూనకి అలవాటు లేదు. అలారం పెట్టి పడుకున్నా, మ్రోగుతున్నప్పుడు దాన్ని ఆపేసి మళ్లీ నిద్రపోతుండేది. అందుకని సుమిత్ర మా గదిలోనే అలారం పెట్టుకుని, లేచి ప్రసూనను లేపేది.

ఫైనలియర్ ఎగ్జామ్స్ అవగానే ప్రసూన ఏదో కంప్యూటర్ కోర్సులో చేరింది. ఆ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో జాబ్ చేస్తున్న అరవింద్ ప్రసూన దగ్గిర పెళ్ళి ప్రపోజల్ తెచ్చాడు. ప్రసూన ఇష్టపడింది కానీ తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఏ ఇంజనీరు సంబంధమో చూసి చేస్తామని అరవింద్‌తో పెళ్లికి ఒప్పుకోలేదు. కట్నకానుకలుండవని అరవింద్ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఇద్దరూ వచ్చి మాకీ విషయాలు చెప్పారు. వాళ్ల కోరికపై నేనూ, మా ఎదురింట్లో వుండే మూర్తీ కలిసి ఇద్దరి యిళ్ళకూ వెళ్ళి నచ్చచెప్పటానికి ప్రయత్నించాము. కానీ ఇరువైపుల వాళ్లూ ససేమిరా అన్నారే కానీ దిగిరాలేదు.

అన్ని విషయాలలోనూ ఇద్దరూ సరిజోడిలా ఉంటారు. కాదనడానికి సరియైన కారణమేదీ లేదు. అందుకే వాళ్ల పెళ్ళికి మా సహాయం అడిగినపుడు మూర్తీ, నేను సరే అన్నాం. మాకు నాలుగు వీధులకవతల సుశీలమ్మగారి చెల్లెలూ వాళ్లుంటారు. ఆవిడా, సుశీలమ్మగారూ మా ఇరుగుపొరుగూ అందరి దగ్గిరా ప్రసూన మా అండ చూసుకునే వాళ్లకి ఎదురు తిరుగుతోందని, మేమే తనని చెడగొడుతున్నామని నిష్ఠూరాలాడేరని మాకు తెలిసింది. అరవింద్ ప్రపోజల్‌ని అంగీకరించే విషయంలో ప్రసూన సరియైన నిర్ణయమే తీసుకుందని మాకనిపించిది. కాబట్టే వాళ్ల మాటలను పట్టించుకోకుండా వాళ్ల పెళ్లికి పెద్దలుగా నిలబడ్డాం.

మా ప్రక్కవీధిలోనే ఒక చిన్న పోర్షన్‌ను పెళ్లికి ముందే అద్దెకు తీసుకున్నారు. కొన్ని ముఖ్యమైన సామానులూ కొనుక్కున్నారు. మా వీధి చివరనున్న దేవాలయంలోనే పెళ్ళి జరిగింది. వాళ్ల ఆఫీసు వాళ్లూ, మా కాలనీలోని కొందరు కలిసి ఓ యాభైమందిమి హాజరయ్యాం. అరవింద్ తల్లిదండ్రులు రాలేదు కానీ లక్ష్మీపతిగారు, సుశీలమ్మగారు ఎవరో వెళ్ళి నచ్చచెబితే వచ్చారు. మొక్కుబడిగా వచ్చి ముహూర్తం టైముకి అక్షింతలు వేసి భోజనాలు చేయకుండానే వెళ్ళిపోయారు.

"పెద్దవాళ్ళ ప్రమేయం లేకుండా పెళ్లి చేసుకుంటున్నారు కాబట్టి లాంఛనాలనీ, అవనీ, ఇవనీ, అనవసరమైన ఖర్చులేవీ లేకుండా సింపుల్‌గా అయిపోయింది. ఇదీ ఒకందుకు బాగానే ఉంది" అని ఇద్దరు ముగ్గురు నవ్వుతూ అన్నారు.

"లక్ష్మీపతిగారూ, సుశీలమ్మగారూ తెలివైన వాళ్ళే. వాళ్ళు పెళ్ళి చేసి వుంటే అన్నీ జరపాల్సి వచ్చేది కదా, అందుకే తెలివిగా తప్పుకున్నారేమో... లేకపోతే చదువులేని తమ్ముడికిచ్చి చేయటానికి సిద్ధపడినావిడ డిగ్రీ చదివి కంప్యూటర్ కోర్స్ చేసి మంచి ఉద్యోగంలో ఉన్న అరవింద్‌తో పెళ్లికి అభ్యంతరం చెప్పటమేమిటీ?" అని సుశీలమ్మగారి గురించి ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు సుమిత్ర దగ్గర వేళాకోళంగా అన్నారు.

మొత్తానికి ఎలాగైతేనేం పెళ్ళి అయింది. వాళ్లు కాపురం పెట్టాక రెండు నెలలయినా పూర్తిగా గడవక ముందే అరవింద్‌కి సింగపూర్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. ఒక నెలలో వాళ్లు అక్కడికి వెళ్లిపోతారని తెలియగానే ఇద్దరి తల్లిదండ్రులూ వచ్చి కలిశారు. తొందరగానే అందరూ కలుసుకున్నందుకు మేమూ ఆనందించాం. వీళ్లింట్లో పదిరోజులూ, వాళ్లింట్లో పదిరోజులూ ఉండి ఇద్దరూ సింగపూర్ వెళ్లారు. వెళ్లిన వెంటనే ప్రసూన మాకు ఫోన్ చేసింది. ఆ తర్వాత నుండీ సుశీలమ్మగారు అప్పుడప్పుడూ వాళ్ళ విశేషాలు పెరటిగోడ దగ్గర్నుండీ చెబుతుండేవాళ్లు.

రెండు సంవత్సరాల వరకూ రారని అనుకున్నాం. కానీ ఆఫీసు పనిమీద పంపిస్తున్నందు వల్ల సంవత్సరానికే వస్తున్నారన్న మాట!

"కాఫీ తీసుకోండి" సుమిత్ర మాటలతో ఆలోచనల నుండి బయటపడ్డాను.

"ఆ మధ్య మనం కొన్న కొత్త కాసెట్స్ మూర్తిగారి దగ్గరే ఉండిపోయాయిగా, అడిగి తీసుకోండి" అంది సుమిత్ర.

"మనం విన్నవేగా అర్జంటేముందీ, వాళ్లే ఇస్తారులే."

"అది కాదు... ప్రసూనకి పాటలు వింటూ నిద్రపోవటం ఇష్టం కదా. తను మనింట్లో ఉండే రెండు రోజులూ టేప్ రికార్డర్ చిన్న బెడ్‌రూమ్‌లో పెడతాను. కొత్త పాటలు వింటుంది కదాని కాసెట్స్ తీసుకోమన్నాను"

నాకు ఆశ్చర్యంగా అనిపించింది. "అపుడంటే చదువుకోవటానికని మనింట్లో ఉండేది. ఇప్పుడెందుకుంటుందీ?"

"వెళ్లేముందు ప్రసూన ఏమందో మీరు మర్చిపోయారేమో కాని నాకు బాగా గుర్తుంది. 'ఈ గదిలో రెండేళ్లుగా చదువుకుంటూ గడిపినందువల్లనేమో... ఇది నా స్వంతమన్నట్లుగా ఒక రకమైన మమకారం ఏర్పడిపోయిందాంటీ! నేను ఎప్పుడు వచ్చినా ఇక్కడ రెండురోజులుండి వెళ్తాను. మీరు కాదనటానికి లేదు' అని అనలేదూ?"

ప్రసూన వెళ్లేరోజున అభిమానంగా ఏదో మాటవరసకి అన్నమాటలను సుమిత్ర ఎంత బాగా గుర్తుపెట్టుకుందీ! నాకు నవ్వొచ్చింది.

అయిదారు రోజుల తర్వాత నాకు గుర్తుకు వచ్చింది. సుమిత్ర ప్రసూన సంగతులేమీ చెప్పలేదు. వచ్చిందా, రాలేదా అని అనుమానం వచ్చింది. అదే అడిగాను.

"ప్రసూన మొన్ననే వచ్చిందన్న సంగతి నాకూ ఈ రోజే తెలిసింది. మొన్న అత్తగారింటికి వెళ్లొచ్చింది. నిన్న పిన్నీ వాళ్లింటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉందట. ఈ రోజు మధ్యాహ్నం వస్తుందని,

తను అక్కడ నుండి తెచ్చిన వస్తువుల్ని చూడటానికి రమ్మని సుశీలమ్మగారు నన్నూ, శ్రీశీదేవిని పేరంటానికి పిలిచినట్లుగా పిలిచారు. ఇద్దరం వెళ్లొచ్చాం.

ప్రసూనకీ అక్కడ మంచి ఉద్యోగం వచ్చిందట. తమ్ముళ్లిద్దరికీ బూట్లూ, షర్టులూ, రిస్టువాచీలూ తెచ్చింది. ఇంకా కెమేరా, డిన్నర్ సెట్టూలాంటివేవో తెచ్చింది. సుశీలమ్మగారు ఇవన్నీ చూపిస్తున్నప్పుడే ప్రసూన పిన్నీ వాళ్లింటినుండీ వచ్చింది. మునుపెన్నడూ ఆవిడ ప్రసూనని 'మొండిది... మాట వినదు' అంటూ పదే పదే అందరిముందూ విసుక్కునే వాళ్లుగా, ఈరోజు తమ్ముళ్లిద్దరి చదువు బాధ్యతా తనే తీసుకుంటానని ప్రసూన చెప్పిందంటూ తెగపొడిగేశారు. ప్రసూన కూడా చాలా సంతోషంగా కనిపించింది." సుమిత్ర చెప్పింది.

"సహజమేగా! మునుపు తనని చిన్నచూపు చూస్తున్నారని బాధపడేది. ఇప్పుడు ఆధిక్యత చూపిస్తుంటే ఆనందంగా ఉంటుంది కదా!"

"నిజమే" అంటూ ఎందుకో సుమిత్ర నిట్టూర్చింది. "బంధువులు, ఫ్రెండ్సూ అందర్నీ కలవాలి కదా, కొంచెం బిజీగా ఉందట. ఎల్లుండి మనింటికి వస్తానని మీకు చెప్పమంది"

సుమిత్ర చాలా నిర్లిప్తంగా మాట్లాడుతున్నట్లుగా అనిపించింది. హుషారుగా లేదు. మనసులో దేనికో మధనపడుతున్నట్లుగా ఉంది.

"దేనికో బాధపడుతున్నట్లుగా ఉన్నావ్, సంగతేమిటి?"

"ఏం లేదు. మామూలుగానే ఉన్నానే" అంది.

"ఆ సంగతి నాకు తెలియదా? ఏదో ఉంది. నా దగ్గిర దాపరికం దేనికీ?" సుమిత్ర నిట్టూర్చింది.

"మేం వచ్చేస్తుంటే ప్రసూన గేటువరకూ వచ్చి నాతో 'మా ఇంట్లో వాళ్లకి తప్ప ఇంకెవరికీ ఏవీ తీసుకురావటానికి కుదరలేదాంటీ' అంది. తను ఏమైనా తెస్తుందనిగానీ తేవాలనిగానీ నేను అనుకోలేదు. అయినా గానీ ఎందుకో ఆ మాటకి మనస్సు చివుక్కుమంది. చాలా కష్టంగా అనిపించింది.

ఇక్కడున్నప్పుడు రెండు మూడుసార్లు ప్రసూన నాతో ఏమందో తెలుసా? 'ఆంటీ వాళ్లింటికంటూ అస్తమానూ అక్కడికి వెళ్లిపోతుంటావు. ఇక్కడ మనింట్లో లేనిదేమిటీ, అక్కడున్న దేమిటీ అని అమ్మ అంటూ వుంటుంది. అక్కడ లేనిదేమిటో, ఇక్కడున్నదేమిటో చెప్పినాగానీ తనకి అర్థం కాదని మాట్లాడకుండా వూరుకుంటాను. అసలు అర్థం చేసుకునే శక్తే వుంటే నాకీ సమస్యలే ఉండేవి కావు! నా ఆలోచనలు, సమస్యలు ఏవైనా సరే మీతో చెప్పుకోగలిగినట్లుగా తన దగ్గిర చెప్పుకునే చనువుని అమ్మా నాకెపుడూ ఇవ్వలేదు!' అని నాతో అనేది. అలా ఇంట్లో వాళ్లకంటే కూడా మనమెంతో దగ్గర అన్నట్లుగా ఆత్మీయంగా ఉండే ప్రసూన..."

సుమిత్ర మాటలు పూర్తికాకముందే నేనందుకున్నాను. "మనం తన చదువు విషయంలో కొంచెం ప్రోత్సాహాన్ని అందించాం పెళ్ళి విషయంలో పెద్దరికం వహించాం! అంతమాత్రాన కని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల కంటే మనం ఎక్కువవుతామా? తనేదో అభిమానంగా మాటవరసకి అన్నమాటల్ని నూటికి నూరుపాళ్లు నిజమన్నట్లుగా అనుకుంటామా?"

"ఆ విషయం నాకూ తెలుసు. పిల్లలకి ఏం చేసినా తల్లిదండ్రులుగా వాళ్ల బాధ్యత అది. కానీ ఇరుగుపొరుగుగా మనం ఏం చేసినా అది తప్పకుండా ఎక్కువే! ప్రసూన పెళ్ళికి భోజనాలు వగైరా ఖర్చులు అయిదారువేల వరకూ మీరు పెట్టారు. వాళ్లు నిదానంగా తీరుస్తామని అన్నా, వద్దని పెళ్ళికి

ప్రెజింటేషన్‌గా అనుకోమని చెప్పారు. మూర్తిగారు కూడా చిన్న చిన్న ఖర్చులు పెట్టటమే కాకుండా పెళ్లి పనుల్లోనూ బాగా తిరిగారు కూడా.

ప్రసూన అక్కడి నుండి మీకు ఏ చిన్న వస్తువైనా ప్రెజెంటేషన్‌గా తెచ్చి వుంటే... తనతో మనకున్న అనుబంధం కొద్దీ మనలో మనకేమిటిలే, మూర్తిగారికివ్వటం బావుంటుందని చెప్పి వుండేదాన్ని. అలా సుశీలమ్మగారు ఇంట్లో వాళ్లకంటే ముందుగా మీ ఇద్దరికీ ఏవైనా కానుకగా ఇస్తే బావుంటుందని తెలియజెప్పి వుండాల్సింది.

కానీ ఆవిడంత పద్ధతి తెలిసిన మనిషి కాదని నాకు తెలుసు. ప్రసూనకి ఫైనలియర్ మార్కు ్స వచ్చిన రోజున గోడమీద నుండి నన్ను పిలిచి తనకి అన్ని సబ్జెక్ట్స్ కంటే లెక్కల్లోనే మంచి మార్కులు వచ్చాయని చెప్పింది. శర్మగారు తనకి రెండేళ్లు ట్యూషన్ చెప్పారుగా అందుకని 'సాయంకాలం వెళ్లి శర్మగారికీ విషయం చెప్పు సంతోషిస్తారు' అన్నాను. అక్కడే వున్న సుశీలమ్మ గారు 'మీ వారూ, ఆయనా ఒకే కాలేజీలో లెక్చరర్స్ కాబట్టి ఆ స్నేహం కొద్దీ ట్యూషన్ చెప్పారుగానీ మమ్మల్ని బట్టి కాదుగా' అన్నారు. అంటే ఆయనకి థ్యాంక్స్ చెప్పాల్సిన అవసరం మనకేగానీ వాళ్ళకి లేదని అర్థం కాబోలు! నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది! ఆవిడ మనస్తత్వం తెలుసు గనుక ఆవిడ మాటల్ని పట్టించుకోను. కానీ ప్రసూన..."

"ఎవరైనా చేసిన సహాయానికిగానీ, చూపించిన అభిమానానికి గానీ ప్రతిగా స్పందించడం అనేది వాళ్ల వాళ్ల సంస్కారాన్ని బట్టి వుంటుంది! ఎవరైనా మనకి సహాయం చేస్తే గుర్తుపెట్టుకోవాలి. మనం ఎవరికైనా చేసిన సహాయాన్ని మరిచిపోవాలి. అది మంచి పద్ధతి. అంతేగానీ కృతజ్ఞతనీ, కానుకల్నీ కోరుకోకూడదు."

నా మాటలకి సుమిత్ర చుర చుర చూసింది.

"కానుక అనేది వస్తు రూపంలోనే ఉండక్కర్లేదండీ! ఆ మధ్య మీ స్కూటర్ పాడయిన రోజున ఆటోకోసం చూస్తుంటే... మీ ఓల్డ్‌స్టూడెంట్ కారులో వెళ్తూ చూసి మిమ్మల్ని కాలేజ్ దగ్గర డ్రాప్ చేసాడని చెప్పారు. దారిలో అతను తను ఏదో అనారోగ్యం వలన కొన్నాళ్లు కాలేజీకి రాలేకపోతే మీరు ఆ లెసెన్సు ఇంటిదగ్గర చెప్పించుకోమన్నారనీ, మీలా స్టూడెంట్సుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే మాష్టార్లు తక్కువమంది ఉంటారనీ, మీరు చెప్పే పద్ధతి బట్టే తనకి కెమిస్ట్రీ అంటే ఇంటరెస్టు కలిగిందనీ... ఆ విషయాలన్నీ గుర్తు చేసుకున్నాడనీ చెప్పారు. ఆ విషయం మీరు నాకు చెప్పినప్పుడు మీ మొహంలో ఎంత ఆనందం కనిపించింది! ఆ ఆనందం ఆటో ఖర్చు మిగిలినందుకు కాదు కదా! మీరు అతనిపట్ల చూపించిన శ్రద్ధని గుర్తుపెట్టుకుని, మీ పట్ల చూపించిన గౌరవమే మీకంత ఆనందాన్ని కలుగజేసింది! అవునా?"

నేనేం మాట్లాడలేదు. ఒక క్షణం మౌనంగా ఉండిపోయాను.

సుమిత్ర అన్నది నిజమే! కానుక అన్నది వస్తువు రూపంలోనే ఉండక్కర్లేదు. ప్రసూన వచ్చిన రోజునే సుమిత్రకి కనుపించి పలుకరించినా, మా ఇంట్లో మునుపటిలా ఒక పూట అయినా ఉండటానికి ఉత్సాహం చూపించినా సుమిత్ర చాలా సంతోషపడేది! మరి సుమిత్ర ప్రసూన చదువుపట్ల చాలా శ్రద్ధ తీసుకునేది. ప్రసూన ఆ గదిలో కూర్చుని చదువుకుంటుంటే నేను టీ.వి. పెట్టుకుంటే చాలా తక్కువ సౌండుతో పెట్టుకోవాలని వార్నింగు ఇచ్చేది. మా పిల్లలు సెలవులకి వచ్చినప్పుడు

ప్రసూనకి ఇంకా ఎగ్జామ్స్ జరుగుతుంటే ప్రసూన వాళ్లింట్లోనే చదువుకుంటానని అంటే సుమిత్ర ఒప్పుకునేది కాదు. 'మీ ఇంట్లో అంతా కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే నీకు కాన్‌సన్‌ట్రేషన్ కుదరదుగానీ ఇక్కడే చదువుకో. పిల్లలకి హాల్లో పక్కలు వేస్తాలే' అని చెప్పేది!

దీర్ఘాలోచనలో ఉన్నట్లుగా నిర్లిప్తంగా కూర్చున్న సుమిత్రకి నచ్చచెపుతున్నట్లుగా అన్నాను. "మనం ఎవరికైనా సహాయం చేస్తే... చేయగలిగినందుకు మనకు కలిగే తృప్తీ, ఆనందమే ప్రతిఫలంగా మనం అనుకోవాలి! అది మంచి పద్ధతి! అర్ధమైందా?"

"నాలాంటి మామూలు మనుష్యులు మాత్రం కొంచెం ఆప్యాయతనీ, ఒక మంచి మాటనీ కోరుకుంటారు. అర్ధమైందా?" అంటూ అక్కడ నుండి వెళ్లిపోయింది.

రెండు రోజుల తర్వాత ప్రసూన వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్లింది. ఆ కాసేపటిలోనే ఎక్కడికో వెళ్లాల్సిన పని వుందంటూ రెండుసార్లు టైము చూసుకున్నందువలనేమో సుమిత్ర కూడా ప్రసూనని మరికాసేపుండమని అనలేదు. నాలుగు రోజుల తర్వాత అరవింద్‌తో సింగపూర్ వెళ్ళిపోయింది.

ఒకరోజు నేను బీరువా తెలిరిచినప్పుడు నీలంరంగు సిల్కు చీర కనుపించింది. ప్రసూన కోసమని కష్టపడి కుట్టింది. ఎందుకివ్వలేదో మరి!

"ప్రసూన మీద కోపం వచ్చిందా? తన కోసమని కొన్న చీర ఇవ్వలేదేం? ఇవ్వాల్సింది." సుమిత్ర నిట్టూరుస్తూ అంది "ప్రసూన ఫుల్‌స్టాప్ పెట్టిన చోట నేను కామా పెట్టడం ఎందుకని నేనూ ఫుల్‌స్టాప్ పెట్టేసాను."

నేను "అదేమిటీ?" అంటూ ఆశ్చర్యంగా చూసేసరికి చిన్నగా నవ్వింది.

"రైలులో ఏర్పడిన పరిచయాలకు రైలు దిగగానే ఫుల్‌స్టాప్ పెట్టేస్తాం. ప్రసూన కూడా అలాగే మనతో ఏర్పడిన అనుబంధానికి ఫుల్‌స్టాప్ పెట్టేసినట్లుగా నాకు అనిపించింది. అలాంటప్పుడు నేను తనకి చీర ఇవ్వటం అంటే, నేను కొనసాగింపును కోరుకుంటూ కామా పెట్టినట్లుగా ఉంటుంది. తను మళ్ళీ వచ్చేటప్పుడు కానుకగా ఏదైనా తేవాలేమోనని ఆబ్లిగేషన్‌గా ఫీలవవచ్చు. తనకి అలాంటి ఇబ్బందిని కలిగించటం ఎందుకని నేనూ ఫుల్‌స్టాప్‌నే పెట్టేసానన్నమాట."

ఏమిటీ... ఏదో పాఠం చెబుతున్నట్లుగా చెపుతున్నాననేగా అలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? ఎంతైనా లెక్చరర్‌గారి సతీమణిని కదా, సహవాసదోషం వల్ల నాకూ లెక్చర్స్ ఇవ్వటం అలవాటయిపోయినట్లుంది!" అంటూ చిరునవ్వు నవ్వింది.

రంగస్థలం మీదకు కొన్ని పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంటాయ్! వాటి నిడివి చాలా తక్కువ ఉంటుంది. జీవితంలోనూ అంతే. కొందరితో ఏర్పడే బంధుత్వాలకూ, బాంధవ్యాలకూ ఆయుష్షు ఎంతో ఉండదు! అలాంటివాటి కోసం మధనపడటం కంటే మర్చిపోగలగటమే ఉత్తమం! ఈ విషయాన్ని గ్రహించి సుమిత్ర తొందరగానే తన మనసును స్థిమిత పరచుకున్నందుకు నేనూ తేలికగా నిట్టూర్చాను.

ఆంధ్రప్రభ వీక్లీ. 26, మే, 2001.